Vaartha Dt 28/03/23

# ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు



ఎయిర్‌పోర్టు మెట్రో పిల్లర్ల నిర్మాణం కోసం భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త**

ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టబోయే 100 మెట్రో పిల్లర్లు నమూనాగా తీసుకొని సాయిల్ టెస్టింగ్ చేపడుతున్నారు. ఈ మెట్రో ప్రాజెక్టు కోసం అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. సాయిల్ టెస్టింగ్ పనులు పూర్తికావడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ సంస్థ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మెట్రో స్తంభాల నిర్మాణం ప్రతిపాదించిన ప్రతి చోట భూమి ఉపరితలం నుండి సుమారు 40 అడుగుల లోతు వరకు త్రవ్వకం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల స్తంభాల పునాదులు ఏ మేరకు త్రవ్వాలి. ఓపెన్ ఫౌండేషన్ లేదా పైల్ ఫౌండేషన్ నిర్ణయం, అనుమతించదగిన బేరింగ్ ప్రెజర్ తదితర విషయాలు తేటతెల్లమవుతాయని ఆయన అన్నారు.

సాయిల్ టెస్టింగ్‌లు నిర్వహించడం వల్ల టెండర్ ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్ లకు కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగే భూమి తీరుపై ఒక అవగాహన కలుగుతుందని, అలాగే టెండర్లలో పాల్గొనే సమయంలో తగిన ఆర్థిక అంచనాలు రూపొందించుకోవడంలో కూడా ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ పరీక్షల మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, దృఢమైన బారికేడింగ్, తదితర అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అలాగే జీహెచ్ఎంసి, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎయిర్‌పోర్టు మెట్రో ముందస్తు పనులు చురుకుగా చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సాయపరెడ్డి నేతృత్వంలోని మెట్రో ఇంజనీరింగ్ బృందం సాయిల్ టెస్ట్ పనులను పర్యవేక్షిస్తున్నారు.